Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 213 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 2 - 4 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో పలు నిర్మాణ పనులపై సమీక్ష నిర్వహించిన ఏజిఐసిఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వి.ఆర్. శ్రీనివాస్





**అమరావతి, (రాజధాని వార్తలు):** ప్రజారాజధాని అమరావతి–అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో నిర్మిస్తున్న హైకోర్టు, నాన్ గెజిటెడ్ అధికారుల టవర్ల నిర్మాణ పనులపై అమరావతి గ్రోత్ & ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.వి.ఆర్.శ్రీనివాస్ బుధవారం సమీక్ష నిర్వహించారు. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ రెండు ప్రాజెక్టుల పురోగతిని పరిశీలించిన ఎస్.వి.ఆర్.శ్రీనివాస్, ప్రాజెక్టులను నిర్వహిస్తున్న గుత్తేదారులు, ఇంజినీరింగ్ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఎస్.వి.ఆర్. సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బందికి సమీక్షలో ఆదేశాలిచ్చారు.

ఎన్‌జిఓ టవర్స్: అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో భాగంగా నాన్ గెజిటెడ్ అధికారులు నివాసం ఉండేందుకు మొత్తం 21 టవర్లను(12+9 ) రాజధాని అమరావతిలోని నేలపాడులో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. మొత్తం 26.61 ఎకరాల విస్తీర్ణంలో ఈ టవర్లను నిర్మిస్తున్నారు. 35.63 లక్షల చదరపు అడుగుల బిల్ట్ అప్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ 21 టవర్లలో నాన్ గెజిటెడ్ అధికారులకై 1,968 నివాస గృహాల నిర్మాణం జరుగుతోంది.

హైకోర్టు:

రాజధాని అమరావతి–అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని నేలపాడు సమీపంలో 42 ఎకరాల విస్తీర్ణంలో బేస్‌మెంట్+గ్రౌండ్ + 7 ఫ్లోర్లలో..20.32 లక్షల చదరపు అడుగుల ఫ్లోర్ ఏరియాలో పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ హైకోర్టు నిర్మాణం శరవేగంగా జరుగుతోంది.

## అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### - ఇది చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలక మైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. "తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవ రూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొందని పవన్ విమర్శించారు. రైతుల పోరాటాలు, మహిళల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలు అసాధారణమైన ధైర్యాన్ని, స్పష్టతను ప్రదర్శించారని కొనియాడారు. స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజలు అభివృద్ధికి, సుస్థిరతకు పట్టం కట్టారని అన్నారు. పార్లమెంటు ఆమోదంతో రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లోనూ బలమైన, పునరుత్తేజంతో కూడిన విశ్వాసం ఏర్పడిందని పవన్ అభిప్రాయపడ్డారు. అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్, ప్రధాని మోదీ ఆవిష్కరించిన వికసిత భారత్ లక్ష్యాల సాధనలో అమరావతి కీలక పాత్ర పోషిస్తుందని ఆయన దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఒకే ఒక రాజధాని అమరావతికి ఇక తిరుగులేదు



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి. అమరావతి ఇక అజేయం.. అజరామరం" అని అన్నారు. రాజధానిని ప్రపంచ పటంలో నిలిపేలా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాజ్యసభకు చేరిన రాజధాని అమరావతి బిల్లు



**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా చట్టబద్ధత కల్పించిన బిల్లుకు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు చేరింది. ఈ బిల్లు తమ వద్దకు వచ్చిందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ ఈ రోజు న్యూఢిల్లీలో వెల్లడించారు. ఈ బిల్లు ఆమోదం కోసం గురువారం రాజ్యసభలో పెడతామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.00 గంటకు ఈ బిల్లుపై సభలో చర్చ జరగనుంది. రాజ్యసభలో సైతం ఈ బిల్లు ఆమోదం పొందితే.. అనంతరం రాష్ట్రపతి వద్దకు ఈ బిల్లును పంపుతారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఈ బిల్లును ఆమోదిస్తూ సంతకం చేస్తే.. రాజధాని అమరావతి చట్టంగా మారుతోంది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ బుధవారం లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. ఈ చర్చలో టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్, వైసీపీ సమాజ్ వాదీతోపాటు పలు పార్టీలు ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అంటూ రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. దీనిని కేంద్రానికి పంపిన విషయం విదితమే.



**విహంగ వీక్షణం ద్వారా ఒంటిమిట్ట ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు. ఆలయ అభివృద్ధికి, విస్తరణకు ప్రణాళికలు అమలు చేసే యోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు**


## కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి కీలక అడుగులు

**- నేడు ఢిల్లీకి పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్..రేపు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ - పెండింగ్ లో ఉన్న కీలక పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదానికి విజ్ఞప్తి.. రూ. 900 కోట్లకు పైగా విలువైన 9 కొత్త ప్రతిపాదనలపై డీపీఆర్‌ల సమర్పణ - ప్రసాద్, స్వదేశ్ దర్శన్ పథకాల కింద ఆధ్యాత్మిక, ఐకానిక్ కేంద్రాల అభివృద్ధికి మంత్రి దుర్గేష్ కసరత్తు - సీఎం చంద్రబాబు దిశానిర్దేశంలో ఏపీని అంతర్జాతీయ పర్యాటక హబ్‌గా మార్చేందుకు మంత్రి కందుల దుర్గేష్ కృషి - తెలుగు భాషా వైభవానికి గుర్తింపుకు చర్యలు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు'సూర్యరాయాంధ్ర నిఘంటువు' పునర్ముద్రణపై కీలక చర్చలు**

**న్యూఢిల్లీ/అమరావతి, (రాజధాని వార్తలు):** కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం వేళ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ నేడు హస్తిన పర్యటనకు బయలుదేరి వెళ్తున్నారు. రేపు (గురువారం) ఉదయం 9 గంటలకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో భేటీ అయి పెండింగ్‌లో ఉన్న కీలక పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదానికి విజ్ఞప్తి చేయనున్నారు. అదే క్రమంలో రాష్ట్రంలో ఐకానిక్ పర్యాటక కేంద్రాలు, ఆధ్యాత్మిక సర్క్యూట్‌ల బలోపేతం కోసం మొత్తం రూ. 915 కోట్ల విలువైన 9 కొత్త ప్రతిపాదనలను కేంద్రానికి సమర్పించనున్నారు.

**పెండింగ్ ప్రాజెక్టుల సాధనకు కృషి:**

గతంలో మంత్రి కందుల దుర్గేష్ చేసిన కృషి ఫలితంగా శాస్కి, ప్రసాద్, స్వదేశీ దర్శన్, సిబిడిడి వంటి పథకాల కింద రాష్ట్రానికి ఇప్పటికే 8 పర్యాటక ప్రాజెక్టుల రూపంలో రూ. 430 కోట్లు కేంద్రం ద్వారా కేటాయించబడ్డాయి. ప్రస్తుతం పట్టాలెక్కిన ఈ



పనుల పురోగతిని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కి వివరించడంతో పాటు, నిధుల విడుదల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి దుర్గేష్ కోరనున్నారు.


**నూతన ప్రతిపాదనలు - రూ. 915 కోట్ల అంచనాలు :**

ఇప్పటికే కీలకమైన పర్యాటక, సాంస్కృతిక ప్రాజెక్టుల ఆమోదం కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన మంత్రి దుర్గేష్ ఈ కొత్త ఆర్థిక సంవత్సరంలో వాటిని సాధించే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. నూతన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ప్రత్యేక సవాళ్లను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్‌లు సమర్పించిన ప్రాజెక్టులన్నింటినీ మంజూరు చేయాలని ఆయన కేంద్రాన్ని విజ్ఞప్తి చేయనున్నారు. ప్రధానంగా మచిలీపట్నంలో వైబ్రెంట్ బీచ్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు స్వదేశ్ దర్శన్ 2.0 కింద రూ.120.04 కోట్లు, ప్రసాద్ స్కీమ్ క్రింద రూ. 95.18 కోట్లతో మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, రూ.213.72 కోట్లతో అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవాలయం, రూ.48.95 కోట్లతో ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని శ్రీ గృహ మల్లేశ్వర స్వామి ఆలయం,రూ.36 కోట్లతో కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, రూ.120 కోట్లతో వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానాలకి నిధులు కోరనున్నారు. అదే విధంగా రూ.103.05 కోట్లతో లేపాక్షిలో పర్యాటక సౌకర్యాలు,సాంస్కృతిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి, రూ.99.87 కోట్లతో లంబసింగిలో పర్యాటక అనుభూతిని మెరుగుపరిచే అభివృద్ధి పనులు, ఏపీలోని ప్రధాన బౌద్ధ క్షేత్రాల వద్ద టెంట్ సిటీల అభివృద్ధికి రూ.77.32 కోట్ల నిధులకు విజ్ఞప్తి చేయనున్నారు. దేశంలోని 50 ప్రపంచ స్థాయి పోటీ పర్యాటక కేంద్రాల అభివృద్ధి మిషన్‌లో భాగంగా తిరుపతి, విశాఖపట్నంలను చేర్చాలని కోరనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రానికి రాసిన లేఖను కూడా ప్రస్తావిస్తూ, అవసరమైన భూములను ఇప్పటికే గుర్తించినట్లు వెల్లడించనున్నారు. అదే విధంగా అమరావతిలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ ఏర్పాటుకు మంత్రి దుర్గేష్ మద్దతు కోరనున్నారు. శీలాభీడే కమిటీ సిఫార్సు మేరకు అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్‌పీరియన్స్, ఇంటర్‌ప్రిటేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ (పర్యాటక భవన్) ఏర్పాటుకు రూ.100 కోట్ల ఆర్థిక సహాయాన్ని (మిగతా 8వ పేజీలో)

# ఐటీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**- సారపాక గ్రామపంచాయతీ 14వ వార్డు మెంబర్ కొమరం సావిత్రి**




**బూర్గంపాడు, (రాజధాని వార్తలు):** బూర్గంపాడు మండలం సారపాక పట్టణంలో జరుగుతున్న ఐటిసి కాంట్రాక్ట్ కార్మికుల న్యాయమైన సమస్యలను యజమాన్యం వెంటనే పరిష్కరించాలని సారపాక మేజర్ గ్రామపంచాయతీ 14వ వార్డ్ మెంబర్ కొమరం సావిత్రి డిమాండ్ చేశారు. మంగళవారం ఐటిసి పేపర్ పరిశ్రమ సమీపంలో గత ఆరు రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల సమ్మె శిబిరాన్ని కొమరం సావిత్రి సందర్శించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేసినారు. కాంట్రాక్ట్ కార్మికులు చేస్తున్న డిమాండ్లు చాలా న్యాయమైనయని యజమాన్యం పరిష్కరించే సమస్యలనే వారి దృష్టికి తీసుకెళ్తున్నారని కొమరం సావిత్రి తెలిపారు. ఒకపక్క కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్లను తీసుకు వచ్చి కాంట్రాక్ట్ కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతూ మరోపక్క యజమాన్యాలు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయించుకోవడం సమంజసం కాదని అన్నారు. గత 13 అగ్రిమెంట్లు చేసిన తరుణంలో తమకు అన్యాయం జరిగింది కాబట్టే ఈ 14వ అగ్రిమెంట్లోనైనా తమకు గౌరవంగా గుర్తించి వేతనాల పెంపుదలకు కాంట్రాక్ట్ కార్మికులతో చేస్తారని ఆశతో మాత్రమే ఈ నిరసన కార్యక్రమం వాళ్ళు చేస్తున్నట్లు ఉందని అన్నారు ఐటీసీ యాజమాన్యం మరియు గుర్తింపు సంఘం కాంట్రాక్టు కార్మికుల కష్టాన్ని గుర్తించాలని అందుకు అనుగుణంగా పెరుగుతున్న ధరలను భరించాలంటే కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు కాంట్రాక్ట్ కార్మికుల పోరాటాన్ని సంబంధిత లేబర్ అధికారులు గుర్తించి యజమాన్యంతో చర్చలు జరిపి కాంట్రాక్ట్ కార్మికుల కోరికలు ఏవైతే ఉన్నాయో వాటి పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలియ జేయడమే కాకుండా ప్రత్యక్షంగా వారు నిర్వహించే ఆందోళన పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వామిని అవుతానని ఆమె తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమం కోసం వారి సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని ఆ మేరకు అండగా ఉంటానని భరోసా కల్పించారు.

# సీతం అధ్యాపకులు, విద్యార్థుల ప్రతిభ క్వాంటం కంప్యూటింగ్ అడ్వాన్స్డ్ అల్గారిథమ్స్ కోర్సుకు నలుగురు సభ్యులు ఎంపిక



**విజయనగరం, (రాజధాని వార్తలు):** స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలకు చెందిన చెందిన క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ నుంచి నలుగురు సభ్యులు, వైజర్ మరియు క్యూబైటెక్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక క్వాంటం అల్గారిథమ్స్ కోర్సుకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో మొదటి సంవత్సరం విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీలత, గణితశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.శ్రీ చందన; సి.ఎస్.ఇ చివరి సంవత్సరం విద్యార్థిని ఎం.త్రివేణి; మరియు చివరి సంవత్సరం సి.ఎస్.ఇ విద్యార్థి సి.పూర్ణచంద్ర శేఖర్ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చొరవతో వైజర్ మరియు క్యూబైటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్వాంటం ఫండమెంటల్స్ కోర్సును ఈ నలుగురు అభ్యర్థులు విజయవంతంగా పూర్తి చేశారు. ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా శిక్షణ పొందిన సుమారు 67,000 మంది విద్యార్థులు మరియు అధ్యాపకులలో, ఈ ఉన్నత స్థాయి కోర్సుకు కోసం కేవలం 3,000 మందిని మాత్రమే ఎంపిక చేయబడ్డారు. ఎంపికైన సభ్యులు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పట్ల తమ నిబద్ధతను ప్రదర్శిస్తూ, సీతంలోని క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ నిర్వహించిన వివిధ క్వాంటం కంప్యూటింగ్ శిక్షణా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ విజయం పట్ల కళాశాల డైరెక్టర్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, క్వాంటం కంప్యూటింగ్ భవిష్యత్తుకు ప్రతీక అని, మరియు ఈ అత్యాధునిక రంగంలో ముందంజలో ఉండటానికి తమ సంస్థ చురుకైన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ విజయం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను స్వీకరించడంలో సంస్థ యొక్క అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని మరియు క్వాంటం కంప్యూటింగ్ రంగాన్ని అన్వేషించడానికి మరింత మంది విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి నొక్కి వక్కాణించారు. క్వాంటం అల్గారిథమ్స్ కోర్సుకు ఎంపిక కావడం అనేది సీతంలో ఉన్నత పరిశోధనా కార్యక్రమాలకు ఒక ఆశాజనకమైన ఆరంభం అని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి.జి. ప్రసూన వ్యాఖ్యానించారు. క్వాంటం సాంకేతికతలపై అవగాహన కొత్త మరియు ఉత్తేజకరమైన కెరీర్ అవకాశాలను తెస్తుందని పేర్కొంటూ, విద్యార్థుల విజయం పట్ల కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి వేణుమాధవరావు సంతోషం వ్యక్తం చేశారు.

# ఏడు కొండలు మృతిపై దర్యాప్తు చేస్తున్నాం

**- దర్యాప్తులో భాగంగా ఎవరి వల్ల నిర్లక్ష్యం జరిగిందో తెలుసుకొని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం : ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు**





**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని తుమ్మకాపల్లి గ్రామానికి చెందిన ఆకుల ఏడుకొండలు (17) (తండ్రి గౌరు నాయుడు) అనే యువకుడు గజపతినగరం జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం విద్యుత్ ఘాతానికి గురై మరణించాడు. తుమ్మకపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండలు ఏ సిద్దు తన తోబుట్టువు పెళ్లి కార్డులు పంచడానికి తేదీ 30.03.2026 న సాయంత్రం సుమారు 6:45 గంటల సమయంలో గజపతినగరంలోని బైరిపురం ఆటో స్టాండ్ జంక్షన్ దగ్గర ఉన్న నేషనల్ హైవేను దాటబోయాడు. ఆ సమయంలో జాతీయ రహదారి మధ్యలో ఉన్న డివైడర్‌ను దాటుతుండగా డివైడర్ పైన ఉన్నటువంటి ఫ్లడ్ లైట్ స్తంభం యొక్క వైరు క్యాప్ వెయ్యకపోవడం వలన కరెంటు తీగలు బయటకు వచ్చి ఉండడంతో విద్యుత్ ఘాతానికి గురై ఏడుకొండలు మరణించాడు. ఆ సమయంలో చుట్టుప్రక్కల ఉన్నవారు ఏడుకొండలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినారు. అప్పటికే ఏడుకొండలు మరణించాడని వైద్యులు ధృవీకరించారు.

కొడుకు మరణ వార్త తెలుసుకున్న తండ్రి ఆకుల గౌరు నాయుడు బాధాతప్త హృదయంతో గజపతి నగరం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నాడు. తన కొడుకు మృతికి జాతీయ రహదారి అథారిటీ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి తండ్రి గౌరు నాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మృతుడి తండ్రి గౌరునాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్. ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు విలేకరులకు తెలియజేశారు. దర్యాప్తు ఆధారంగా ఎవరి వల్ల నిర్లక్ష్యం జరిగిందో తెలుసుకొని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్.ఐ కే.కిరణ్ కుమార్ నాయుడు తెలియజేశారు.

# విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేసిన మంత్రి "కొండపల్లి శ్రీనివాస్"

**- విద్యార్థులతో మమేకమై స్ఫూర్తిదాయకంగా నిలిచిన మంత్రి శ్రీనివాస్**

**- లొట్లపల్లి జెడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి శ్రీనివాస్**









**జామి, (విజయనగరం), (రాజధాని వార్తలు):** మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్ఫూర్తిదాయకంగా వ్యవహరించారు. విద్యార్థులతో కలిసి నేలపైనే కూర్చొని భోజనం చేయడం ద్వారా తన నిరాడంబరతను చాటుకున్నారు. వారితో మమేకమై ఉత్సాహాన్ని నింపారు. జామి మండలం లొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారత శాఖామాత్యులు కొండపల్లి శ్రీనివాస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ఎంతో ఆప్యాయంగా మమేకమై, వారి చదువుల పురోగతి గురించి ఆరా తీశారు. ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. కష్టపడే వారికి విజయం తప్పక సిద్ధిస్తుందని అన్నారు. బాగా చదువుకోవడం ద్వారానే జీవితంలో గొప్ప అభివృద్ధిని సాధించగలరని ఆయన స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన మంత్రి, స్వయంగా విద్యార్థులకు వడ్డన చేశారు. తన హోదాను పక్కనపెట్టి, సామాన్యుడిలా విద్యార్థులతో కలిసి నేలపైనే కూర్చుని భోజనం చేయడం అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంది. భోజనం తర్వాత కాసేపు విద్యార్థులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఒక మంత్రి హోదాలో ఉండి కూడా విద్యార్థులతో ఇంత నిరాడంబరంగా గడపడం అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచింది.

# బాలల రక్షణ అందరి బాధ్యత

**- పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన**



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** మన్యం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ టి. కనకదుర్గ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో పోక్సో చట్టం, బాలల హక్కులపై భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చట్టంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ మాట్లాడుతూ, 18 ఏళ్లలోపు బాలలపై జరిగే లైంగిక, మానసిక వేధింపుల నుండి రక్షణ కల్పించడమే పోక్సో చట్టం-2012 ముఖ్య ఉద్దేశమని తెలిపారు. చట్టంలోని కీలక సెక్షన్ల గురించి వివరిస్తూ.. బాలలపై లైంగిక దాడికి పాల్పడితే (సెక్షన్ 3 & 4) కనీసం 10 ఏళ్ల నుండి జీవిత ఖైదు వరకు శిక్ష పడుతుందని, తీవ్రమైన పరిస్థితుల్లో మరణశిక్ష కూడా విధించవచ్చని (సెక్షన్ 5 ఒ 6) హెచ్చరించారు. వేధింపులకు పాల్పడే వారికి నేర తీవ్రతను బట్టి 3 నుండి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష మరియు జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు. లీగల్ ఆఫీసర్ పారిసర్ల శ్రీధర్ మాట్లాడుతూ, బాల్య వివాహ నిషేధ చట్టం-2006 ప్రకారం బాల్య వివాహం చేసుకునే వరుడికి రెండేళ్ల జైలు శిక్ష మరియు ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. వేధింపులు ఎదురైనప్పుడు లేదా ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినప్పుడు భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్) కి సమాచారం అందించాలని సూచించారు. వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ మాట్లాడుతూ మహిళలు, బాలికలు గృహ హింస లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉన్నప్పుడు సహాయం కోసం 181 (మహిళా హెల్ప్‌లైన్) కు కాల్ చేయాలని కోరారు. వివో ఐ.సి.ఎన్. ప్రసాద్ రావు మాట్లాడుతూ, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వద్దు - జీవితమే ముద్దు అనే నినాదంతో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ టి.పైడిపినాయుడు, రామకృష్ణ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష విధించిన కోర్టు



**పాచిపెంట, (రాజధాని వార్తలు):** పాచిపెంట పోలీసు వారి సమాచారం మేరకు, పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపిన ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష, మరో ఇద్దరికీ 10 వేల రూపాయలు చెప్పున జరిమానా విధిస్తూ సాలురు కోర్టు వారు తీర్పు ఇచ్చినట్లు ఎస్సై లాలం అర్జున్ తెలిపారు. ఎస్సై లాలం అర్జున్ స్పందిస్తూ ఈ యొక్క మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాళ్ల జీవితం నాశనం అయింది కాకుండా వాళ్ళ కుటుంబాల్ని నష్టపరిచే వాళ్ళు అవుతారని, హెల్మెట్ లేకుండా మద్యం సేవించి వాహనాల నడిపిన కఠిన చర్యలు తప్పవని తెలియజేశారు.

# వేగంగా పనిచేయడానికి పక్కా ప్రణాళిక, ప్రాధాన్యతల గుర్తింపు అత్యవసరం

**- ప్రభుత్వ భూముల పరిరక్షణపై స్పష్టత, ఎస్ఎఫ్ఏ రికార్డులే అత్యంత కీలకం**

**- సమీక్షలో రెవెన్యూ అధికారులకు కీలక ఆదేశాలు : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి**




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** వేగంగా పనిచేయడానికి పక్కా ప్రణాళిక, ప్రాధాన్యతల గుర్తింపు అత్యవసరం ఆని జిల్లా కలెక్టర్ డా.ఎన్ ప్రభాకర రెడ్డి అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత పనుల పట్ల కొందరు రెవెన్యూ అధికారుల ఉదాసీనతపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికారులకు బాధ్యతపై అవగాహన ఉండాలని, ప్రతి చిన్న పనికి ఉన్నతాధికారుల నుండి పర్యవేక్షణ అవసరమని భావించడం సరికాదని జిల్లా కలెక్టర్ డా. ఎన్ ప్రభాకర రెడ్డి హితవు పలికారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారుల సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ యంత్రాంగం మరింత సమర్థవంతంగా, వేగంగా పనిచేయడానికి పక్కా ప్రణాళిక మరియు ప్రాధాన్యతల గుర్తింపు అత్యవసరమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విఆర్ఓల పనితీరును మెరుగుపరిచేందుకు అధికారులే స్వయంగా రంగంలోకి దిగి పర్యవేక్షించాలని ఆదేశించారు. తాజాగా నిర్వహించిన కార్యాలయ సమీక్షా సమావేశంలో అధికారులకు పలు కీలక మార్గదర్శకాలను జారీ చేశారు.ప్రతి విఆర్ఓకు సోమవారం నుంచి శనివారం వరకు స్పష్టమైన షెడ్యూల్ ఉండాలి. ఏ రోజు ఏ ఫైల్ నంబర్‌పై ఎంక్వయిరీ చేయాలి, ఏ మ్యూటేషన్ కేసులు పరిష్కరించాలి అనే అంశాలపై స్పష్టమైన 'వర్క్ ఆర్డర్' ఇవ్వాలని సూచించారు. ఒక విఆర్ఓపై పని ఒత్తిడి ఎక్కువగా ఉంటే, ఖాళీగా ఉన్న మరో విఆర్ఓకు ఆ బాధ్యతలు అప్పగించాలి. పని పూర్తి కావడమే ముఖ్యం తప్ప, వ్యక్తులపై ఆధారపడకూడదని పేర్కొన్నారు. పేపర్ సిస్టమ్‌ను క్రమంగా తగ్గిస్తూ, గూగుల్ ఫామ్స్ ద్వారా నివేదికలు సేకరించాలని ఆదేశించారు. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు లేదా మొబైల్ ఫోన్ల ద్వారా అప్పటికప్పుడే సమాచారాన్ని నమోదు చేయడం వల్ల డేటా ఎంట్రీ భారం తగ్గుతుందని వివరించారు. తహశీల్దార్ స్థాయి పోస్టులో ఉన్నప్పుడు ఆ బాధ్యతను పూర్తిస్థాయిలో నిర్వహించాలని స్పష్టం చేశారు. సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డే సందర్భంగా దరఖాస్తుదారుల వివరాలను నేరుగా గూగుల్ ఫామ్స్‌లోనే నమోదు చేయాలని, దీనివల్ల ఏటీజీ నివేదికలు ఆన్లైన్‌లోనే రెడీమేడ్‌గా తయారవుతాయని తెలిపారు. సర్వేయర్లను కూడా ఇందులో భాగస్వామ్యం చేసి, టెక్నాలజీని అలవాటు చేయాలని సూచించారు. అధికారులు తమ పరిధిలోని పనులపై పూర్తి నియంత్రణ సాధించినప్పుడే, సాధారణ పనులతో పాటు నాన్-స్టాట్యూటరీ పనులు కూడా నిర్ణీత సమయంలో పూర్తవుతాయన్నారు. పూర్తి స్థాయిలో ఈ ఆఫీస్ (ఈ ఫైల్), నిర్వహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. యస్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్ వైశాలి, పవర్ స్వప్నల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, ప్రత్యేక ఉప కలెక్టర్ దిలీప్ చక్రవర్తి, జిల్లాలో వివిధ మండలాల తహసీల్దార్లు, మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# షెడ్యూల్డ్ కులాలు - తెగలపై అత్యాచారాల నివారణ చట్టం అమలుపై సమీక్ష

**- ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయడమే జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రధాన లక్ష్యం : జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి**




**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎక్కడైనా అన్యాయం జరిగినప్పుడు వారికి అండగా నిలవడమే జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ డా ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగలపై జరిగే నేరాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత శాఖల సమన్వయంతో చట్టం అమలు సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ అమలుపై సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులు ఫిర్యాదు చేసిన కేసులలో పురోగతిని, విచారణ తీరును మరియు నిందితులకు శిక్ష పడేలా తీసుకుంటున్న చర్యలను కమిటీ సమీక్షిస్తుందన్నారు. "షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్టం, 1989 మరియు నియమావళి, 1995" అమలు, గత సమావేశంలో జరిగిన నాలుగవ త్రైమాసిక సమావేశంలో చర్చించిన అంశాల స్థితిపై సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ముందుగా రెవిన్యూ అంశాలు జియమ్మ వలస మండలం బెలగాం గ్రామంలో స్మశానవాటిక స్థలం, అలాగే తురక నాయుడు వలస గ్రామంలో కుల ధ్రువీకరణ పత్రం మంజూరుపై ఆరాతిసారు. కలెక్టర్ మాట్లాడుతూ స్మశానవాటికలు అవసరాలను గుర్తించి వాటి మంజూరుకు చేర్యలు చేపట్టాలని, స్మశానవాటికల కోసం నివేదికలు సిద్ధం చేసి రానున్న సమావేశంలో అందజేయాలనీ ఆదేశించారు. సమావేశంలో కేసుల పరిశీలన, ఎఫ్ఐఆర్‌లు నమోదు, దర్యాప్తు పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారాలు, పునరావాస చర్యలు, వేగవంతమైన న్యాయ ప్రక్రియ తదితర అంశాలను అధికారులతో సమగ్రంగా వివరాలు తీసుకున్నారు. కేసులు పెండింగ్‌లో ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని, బాధితులకు చట్టప్రకారం లభించే అన్ని సహాయక చర్యలు సమయానికి అందించాలని కలెక్టర్ సూచించారు. పోలీసు శాఖ, సామాజిక సంక్షేమ, ఆదివాసి సంక్షేమ విభాగాలు పరస్పరం సమన్వయంతో పని చేయాలని, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలను పెంచాలని సూచించారు. చట్ట ఉల్లంఘన కలిగించే ఏ చర్యనైనా కఠినంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. పార్వతీపురం శాసన సభ్యులు బోనేల విజయచంద్ర మాట్లాడుతూ పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్ వచ్చిన సందర్భంగా ఆ గ్రామానికి చెందిన దళిత రైతులు సుక్క శ్రీదేవి అనే వ్యక్తిపై ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు లేవు. ఆమె స్వాధీనంలో ఉన్న భూములు గతంలో ప్రభుత్వం పేద రైతులకు ఇచ్చిన భూములు కాబట్టి అవి స్వాధీనం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పి మాధవ రెడ్డి, ఎఎస్పి మనీషా రెడ్డి పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్ వైశాలి, పవర్ స్వప్నల్ జగన్నాథ్, జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం. శ్యామల, కమిటీ సభ్యులు, వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పి4 కార్యక్రమ మొదటి వార్షికోత్సవ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జోన్ -4 నాలుగవ అంతస్తులో జరిగిన పి4 కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర 2047 పి4 విధానంలో సమాజంలోని పేదలను సంపన్నులు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోం దని తెలిపారు. పి4 కార్యక్రమం అమల్లోకి వచ్చి ఏడాది కాలంలో అనేక మార్పులు వచ్చాయని, బంగారు కుటుంబాలకు సహకారం అందించిన మార్గదర్శకులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, మార్గదర్శకులు బంగారు కుటుంబాలు పి4 సభ్యులతో జరిగిన సమావేశములో పలు అంశాలు ప్రస్తావించారు. సమాజంలో అణగారిన వర్గాలను, సంపన్నుల సహకారంతో పైకి తీసుకురావడానికి చేపట్టినప్రా4 విధానం ఇప్పుడిప్పుడే మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నవారు తమవంతు సహకారంతో సమాజంలో మార్పులు తీసుకురావడానికి ఎంతో మంది అభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు.

నియోజకవర్గంలో పి4 ద్వారా లబ్ధి కలగడం పై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పి4 విజయానికి సహకరించిన అనేక మందిని సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

# చెత్త తరలింపు వాహనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి




**కందుకూరు, (రాజధాని వార్తలు):** కందుకూరు నియోజక వర్గం పరిధిలో గల వలేటివారిపాలెం మండలంలోని శాఖవరం, వలేటి వారి పాలెం, పోకూరు పంచాయతీలకు ట్రాక్టర్ ట్రక్కులు,13 పంచాయతీలకు 14 ఆటో రిక్షాలను అందజేశారు. అలాగే చెత్తకు బదులుగా చిల్లర సరుకులు అందించే స్వచ్ఛరథాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రారంభించారు. పారిశుద్ధ్య సిబ్బంది వాహనాలను సక్రమంగా వినియోగిస్తూ ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ గ్రామాలను చెత్తరహితంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నదే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛంద కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందుకోసం ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకే సక్రమంగా విడుదల చేస్తుందన్నారు. జగన్ పాలనలో ఏ పనిచేయాలన్నా డబ్బులు ఉండేవి కావన్నారు. ప్రస్తుతం పంచాయతీ ఖాతాల్లో నిధులు దండిగా ఉన్నాయని, రోడ్లు, త్రాగునీరు, స్మశానాల అభివృద్ధి లాంటి మౌలిక వసతుల కోసం ఖర్చు చేయాలని ఎమ్మెల్యే స్తానిక అధికారులకు సూచించారు. స్థానిక రెవిన్యూ సిబ్బంది నిర్లక్ష్యంపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఇకనైనా పనితీరు మార్చుకోవాలని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. సక్రమంగా పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు ఉంటుందన్నారు. రెవిన్యూలో ఖాళీగా ఉన్న పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామని చెప్పారు.కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే నాగేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. చివరగా ఎమ్మెల్యే స్వయంగా ట్రాక్టర్ నడిపి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకరరావు, డిప్యూటీ తహసిల్దార్ మధుసూదనరావు, స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవులు, మండల టిడిపి అధ్యక్షుడు మాదాల లక్ష్మీ నరసింహం, సర్పంచ్ సాదు శ్రీలత, గ్రామపార్టీ అధ్యక్షుడు కాకుమాని ఆంజనేయులు, గ్రామ పెద్దలు దివి మోహన్ దాస్, గుత్తా మహేశ్వర రావు, వలేటి నరసింహం, కాకుమాని హర్ష, తిరుపతయ్య, కొంకా రమేష్, వలేటి మధు, అంజయ్య, ఖాజావలి, నాయబ్ రసూల్, కూనిపాలెం సర్పంచ్ రాజారమేష్, ప్రగడ శ్రీను, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, బెంజిమన్, చెరువుపల్లి మాల్యాద్రి, వీరయ్య శిఖామణి, అన్ని గ్రామ పార్టీల అధ్యక్షులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసిపి కార్యకర్తకు వాసుపల్లి ఆర్థిక సహాయం

**- ఇంటికి వెళ్లి పరామర్శ - రూ. 5000 అందజేత**



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 31వ వార్డు డాబాగార్డెన్‌లో నివసిస్తున్న సీనియర్ వైసీపీ కార్యకర్త బాణాల కృష్ణ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఉండటం, ఈ కారణంగా కంటి చూపు మందగించడంతో, అతను పరిస్థితిని అవార్డు ప్రెసిడెంట్ బాపు ఆనంద్ వాసుపల్లి గణేష్ కుమార్ దృష్టికి తీసుకురావడం జరిగింది. స్పందించిన గణేష్ కుమార్ సీనియర్ పార్టీ కార్యకర్త బాణాల కృష్ణ ఇంటికి వెళ్లి అతనిని పరామర్శించారు.వైద్య ఖర్చుల నిమిత్తం అతనికి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణాల కృష్ణ కుటుంబానికి తాను అండగా ఉంటానని తెలిపారు. తక్షణ వైద్య ఖర్చులు నిమిత్తం ఐదువేల రూపాయలను అందించడం జరిగిందని, భవిష్యత్తులో అతనికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. పార్టీ పటిష్టతకు, బలోపేతానికి కష్టపడి పనిచేసిన పరిస్థితి కార్యకర్తను పార్టీ గౌరవిస్తుందని, పార్టీలో వారికి సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతి కార్యకర్తకు తాను భరోసా ఇస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 31వ వార్డు ప్రెసిడెంట్ దొడ్డి బాపు ఆనంద్, జిల్లా స్టూడెంట్ వింగ్ జనరల్ సెక్రటరీ పిలక మోహన్, జిల్లా పబ్లిసిటీ వింగ్ సెక్రెటరీ కాంద్రేగుల నాయుడు, వార్డు జనరల్ సెక్రటరీ ఆంగటి త్రినాధ్, కుమార్, వార్డు వైయస్సార్ టి యు సి జనరల్ సెక్రటరీ పెదిరెడ్ల నాగరాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గణగళ్ల రామరాజు, 35వ వార్డు ప్రెసిడెంట్ అలుపన కనకరెడ్డి, 31 వార్డ్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ శ్రీను, వార్డ్ అనుబంధ సంఘాల నాయకులు మోహన్, శేఖర్, కనుక్కుల్లు, శంకర్రావు, 33వ వార్డు యూత్ ప్రెసిడెంట్ బూరెల చిన్న తదితరులు పాల్గొన్నారు.

# సూళ్లూరుపేటలో రోడ్డు ప్రమాదం ఒకరు మృతి

**సూళ్లూరుపేట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా, సూళ్లూరుపేటలో దారుణ రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు ప్యామిలీతో వెళ్తున్న ఆటోను వెనక నుంచి మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవర్ వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్ రోడ్డుపై పడిపోవడంతో అదే సమయంలో వెనక నుంచి వస్తున్న లారీ అతని తలపై నుంచి వెళ్ళడంతో గుర్రప, సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో ఇక్కడి ప్రాంతంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతిదేహాన్ని



పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# సంపాదకీయం

## గ్రీన్‌హంట్ నుంచి కగార్ దాకా...

'ఈ దుర్మార్గమైన వ్యవస్థను కూలద్రోయాల్సిందే సార్.. నేను కూడా అన్నలతో కలిసి పని చేయాలనుకుంటున్నాను..' అని ఇంజనీరింగ్ చదువుతున్న శ్రీనివాస్ అనే 20 ఏళ్ల యువకుడు 1990లో చెప్పాడు. నేను ఆశ్చర్యపోయాను. 'నీకు నక్సలైట్ల గురించి ఏమి తెలుసని వారితో కలిసి పనిచేయాలనుకుంటున్నావు? ముందు బాగా అధ్యయనం చేయి, పుస్తకాలు చదువు.. వారి సిద్ధాంతం పట్ల అవగాహన వస్తే నీకు నచ్చినట్లే చేయి' అని నచ్చజెప్పాను. అతడికి నా మాటలు రుచించినట్లు లేదు. తర్వాత కలవడం మానేశాడు. ఒకటి రెండు చోట్ల రచయితల సమావేశాలలో, బంధుమిత్రుల ఇళ్లలో తటస్థించేవాడు కానీ, నాతో పొడిపొడిగా మాట్లాడేవాడు. ఒక రోజు హైదరాబాద్‌లో నేను పని చేస్తున్న దినపత్రిక కార్యాలయానికి వచ్చాడు. గడ్డం పెంచుకుని మాసిపోయిన దుస్తులతో కనిపించాడు. 'నేను ఇప్పుడు అజ్ఞాతంలో ఉన్నాను. ములికివాడల్లో పనిచేస్తున్నాను. ఈ ప్రెస్ రిలీజ్ పూర్తిగా అచ్చుకావాలి' అని గుసగుసగా మాట్లాడి మాయమయ్యాడు. ఆ తర్వాత కొద్ది రోజులకు నేను ఢిల్లీ వచ్చాను. ఒక ఏడాది తర్వాత సెలవుపై హైదరాబాద్ వచ్చే సరికి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శ్రీనివాస్ సంస్మరణ సభ జరుగుతోంది. హైదరాబాద్ పొలిమేరల్లోనే అతడి ఎన్‌కౌంటర్ జరిగింది. శ్రీనివాస్ గురించి ప్రముఖ విప్లవ రచయితలు ఆవేదనతో, ఆవేశంగా మాట్లాడారు. అతడు రాసినవన్నీ పుస్తకంగా అచ్చేసి ఆవిష్కరించారు. ఒక్కగానొక్క కొడుకును కోల్పోయిన అతడి తల్లిదండ్రులు ప్రెస్‌క్లబ్‌లో ఒక మూలన కూర్చుని మౌనంగా రోదిస్తున్నారు. శ్రీనివాస్ మాదిరే 1975లో కృష్ణా జిల్లా నుంచి గరికపర్రుకు చెందిన సూరపనేని జనార్దన్ వరంగల్ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతూ మాయమై, గిరాయిపల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్‌కు గురయ్యాడు. ఇలాంటి ఎందరో విద్యార్థికులు, యువతీ యువకులు ఆకస్మికంగా నక్సలైట్లుగా మారి ప్రాణాలు కోల్పోయారు. అమర్ రహే నినాదాలతో గోడలు నిండిపోవడం, అమరత్వాన్ని కీర్తిస్తూ కవిత్వం రాయడం మామూలైపోయింది. చాలా కాలం వరకూ, ఎక్కడైనా అన్యాయాలు జరిగితే నక్సలైట్లు ఆదుకుంటారని అనుకునే సామాన్య జనం ఉండేవారు. అందుకే 1983లో ఎన్టీఆర్ నర్సంపేట, ములుగు ప్రాంతాల్లో తిరిగినప్పుడు 'నక్సలైట్లే దేశభక్తులు' అన్నారు. కానీ రెండేళ్లలోనే ఆయన వైఖరి మారిపోయింది. నినాదాలివ్వడం వేరు, ప్రభుత్వాన్ని నడపడం వేరు. గద్దర్, వంగపండులాంటి గాయకులు పాడే పాటలు, విప్లవ రచయితల కవితలు, ఉపన్యాసాలు ఒకప్పుడు తెలుగు ప్రాంతాలను ఉర్రూతలూగించేవి. ఈ వెల్లువలో పవన్ కల్యాణ్ లాంటి సినిమా నటుడు కూడా అన్నల్లో చేరాలనుకున్నారని, ఆయనను చిరంజీవి వారించారని ఎంత మందికి తెలుసు? వివిధ పార్టీల్లో ఉన్న పలువురు రాజకీయ నాయకులకు నక్సల్ నేపథ్యం ఉన్న విషయం సత్యదూరం కాదు. ఆర్థిక సంస్కరణల తర్వాత ఆర్థిక వ్యవస్థలో చాలా మార్పులు వచ్చాయి. సహజంగానే నక్సలైట్లు ప్రతిపాదించే ఆర్థిక నమూనాను సంస్కరణల అనంతరం భారతదేశం అవలంబించిన ఆర్థిక నమూనా తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. మొదట్లో నక్సలైట్ల హింసాకాండ గురించి పార్లమెంట్‌లో ప్రశ్నలు వచ్చినప్పుడు 'శాంతి భద్రతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధికి సంబంధించిన అంశం' అని కేంద్ర హోంమంత్రి సమాధానం చెప్పేవారు. అయితే ఆర్థిక సంస్కరణలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కలిసికట్టుగా పనిచేసేందుకు పురిగొల్పాయి. ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టిన పీవీ నరసింహారావు నక్సలైట్ సమస్యను ఆర్థిక, సామాజిక సమస్యగా భావించారు. ఆయన తరువాయి ప్రధాన మంత్రులు అలా భావించలేదు. ఆర్థిక సంస్కరణల ఫలితంగా ఉపరితలంలోనే కాదు, పునాదిలో కూడా మార్పులు వచ్చాయి. ఈ మార్పుల మూలంగా నక్సలైట్ ఉద్యమం అడవులకు పరిమితమవుతూ, తన అస్తిత్వాన్ని కోల్పోయే పరిస్థితి వస్తుందని గ్రహించే నాటికే చాలా ఆలస్యం జరిగింది. 'ఏ ప్రజల పేరిటనైతే ఒక పంథాను అవలంబిస్తున్నారో, ఆ ప్రజలకు ఆ పంథా పట్ల ఆమోదం ఉన్నదా, అసలు అవగాహన ఉన్నదా, ఆ పంథాను అమలు చేసే క్రమంలో చేస్తున్న హాని, తీస్తున్న ప్రాణాలు, తెస్తున్న నిర్బంధం విప్లవానికి అనివార్యమా..?' అని పౌరహక్కుల మేధావి బాలగోపాల్ 1998లోనే ప్రశ్నించారు. 2026లో లొంగిపోయిన సీనియర్ మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాలరావు కూడా అదే అన్నారు. మావోయిస్టు ఉద్యమం తన స్వయం కృతాపరాధాల వల్ల తప్పుల వల్ల సామాజిక పునాది కోల్పోయిందని, తమదొక విఫల ప్రయోగమని, కొన్ని దశాబ్దాలు ఆ ఉద్యమంలో పనిచేసిన తర్వాత ఆయన చెప్పడం ఆశ్చర్యకరం. ఈ విఫల ప్రయోగానికి సంకేతాలు నక్సలైట్ ఉద్యమ సహ వ్యవస్థాపకుడైన కానూ సన్యాల్ ఆత్మకథలో కూడా ఉన్నాయి. ఆసక్తికరమైన విషయం ఏమంటే ఆర్థిక సంస్కరణలు తీవ్రతరం అవుతున్న రోజుల్లోనే 2000 సంవత్సరంలో మావోయిస్టులు పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీని స్థాపించారు. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును హతమార్చే ప్రయత్నం చేశారు. ఈ శతాబ్ది మొదటి దశకంలో అనేక మంది పోలీసులు నక్సల్స్ దాడుల్లో మరణించారు. 2009లో హోంమంత్రి చిదంబరం సారథ్యంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రారంభమైంది. నక్సలిజం భారతదేశానికి అత్యంత ప్రమాదకరమైన అంతర్గత ముప్పుగా నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ అభివర్ణించిన తర్వాత 2010లో నక్సల్స్ నేతలు చెరుకూరి ఆజాద్, 2011లో కిషన్‌జీల ఎన్‌కౌంటర్ జరిగింది. 2011 డిసెంబర్‌లో ఒక రోజు పార్లమెంట్ సెంట్రల్ హాలులో అప్పటి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి జైరాం రమేశ్‌తో మాట్లాడుతుండగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ ప్రస్తావన వచ్చింది. 'కేంద్ర స్థాయిలో చర్చలు జరిపే ఆలోచన ఏమైనా ఉన్నదా?' అని నేను అడిగాను. 'ఎవరున్నారు చర్చలు జరపడానికి?' అని ఆయన ఎదురు ప్రశ్నించారు.

# జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సేవలు అభినందనీయం

## - ఘనంగా సత్కరించిన ఏపీయూడబ్ల్యూజే



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** విశాఖపట్నం జిల్లా కలెక్టర్ గా సేవలందించి కాకినాడ కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మంగళవారం తన చాంబర్లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూ డబ్ల్యూజే) గాజువాక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ విశాఖ జిల్లా కలెక్టర్‌గా హరేంధిర ప్రసాద్ పేద, సామాన్య జనం సమస్యల పట్ల తక్షణమే స్పందించి వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి కూడా తన వంతుగా సహకారం అందించారని కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల అక్రిడియేషన్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రెండో జాబితా విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, దానిపై సానుకూలంగా స్పందించి తక్షణమే ఆ ప్రక్రియను పూర్తి చేయడానికి అంగీకారం తెలిపారు. సంబంధించి ఈ సందర్భంగా గజమాలతో సత్కరించి ఆయన సేవలను తెలియజేసే ఫోటో ఫ్రేమ్‌ను జర్నలిస్టులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి జర్నలిస్టులు తమ వంతుగా అందించిన సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జర్నలిస్ట్స్ ఫ్రంట్ అధ్యక్షులు డా. ఎం.ఆర్.ఎన్. వర్మ, ఏపీయూడబ్ల్యూజే విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కే. రాము, ప్రధాన కార్యదర్శి ఆర్.రామచంద్రరావు, గాజువాక శాఖ అధ్యక్షులు కొయిలాడ పరుశురాం, స్థానిక పత్రికల సంఘం అధ్యక్షులు పి. సత్యనారాయణ, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.చంద్రమోహన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.హరనాథ్, ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి, పి. నారాయణరావు, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, బి.ఎ. నాయుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

# బాలబాట బాలల మాసపత్రిక ఆధ్వర్యంలో కళారత్న ఉగాది పురస్కార గ్రహీతలకు అభినందన సభ





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** స్వరాజ్యం రమణమ్మ సంపాదకత్వంలో వెలువడుతున్న బాలబాట, బాలల మాసపత్రిక ఆధ్వర్యంలో విశాఖ పౌర గ్రంథాలయంలో ఇటీవల ప్రభుత్వం నుండి పొందిన కళారత్న, ఉగాది పురస్కార గ్రహీతలు అయిదుగురికి అభినందన సభ జరిగింది. ఈ అభినందనలు పొందిన వారిలో డా.డి.వి.సూర్యారావు-కళారత్న ( సాహిత్యం), సత్యవాడ రఘునాథమ్మ – కళారత్న ( సంగీతం), సత్యవాడ సూర్యకుమారి – కళారత్న (సంగీతం),మళ్ళ జ్యోతిర్మయి – ఉగాది పురస్కారం (గజల్ గానము), గంట్ల శ్రీనుబాబు – ఉగాది పురస్కారం (పత్రిక, సేవ) ఉన్నారు. ముందుగా నాట్య గురువు అల్లు వెంకట రమణ సారథ్యంలో జశ్విత, తన్విత, హర్షిత, అనిత విద్యార్థినులు చేసిన నృత్యం. ప్రేక్షకులకు కనువిందు కలిగించింది. సిహెచ్ చిన సూర్యనారాయణ స్వాగతోపన్యాసము చేస్తూ, అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ఈ సభకు బాలబాట సంపాదకురాలు కె.ఎస్.వి.రమణమ్మ అధ్యక్షత వహిస్తూ, ఈ కార్యక్రమం చేయడంలో గల ఉద్దేశ్యాన్ని సభకు వివరించారు. విశిష్ట అతిథి సేవా భూషణ్ పురస్కార గ్రహీత, చైర్మన్ స్వర్ణాంధ్ర కళాకారుల చారిటబుల్ ట్రస్ట్, ఫౌండర్ కె.వి.ఆర్.ఫౌండేషన్ కె.ఇందిరా ప్రియదర్శిని ప్రసంగిస్తూ , తన సంస్థలు ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. గౌరవ అతిథి అధ్యక్షులు విశాఖ సాహితి డా.కె. మలయవాసిని ఉపన్యసిస్తూ, బాలబాట రమణమ్మ సాహితీ సేవలను కొనియాడారు. బిల్డర్స్ అసోసియేషన్ ట్రస్ట్ అధిపతి చెరువు రామకోటయ్య ప్రసంగిస్తూ ఇది మంచి కార్యక్రమం అన్నారు, విశాఖ రచయితల సంఘం అధ్యక్షులు అడపా రామకృష్ణ మాట్లాడుతూ సన్మాన గ్రహీతలను అభినందించారు. మేడా మస్తాన్ రెడ్డి సన్మాన కార్యక్రమాన్ని సమయస్ఫూర్తి వ్యాఖ్యానంతో నిర్వహించారు పురస్కార గ్రహీతలు, సన్మాన కార్యక్రమం తర్వాత స్పందిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.


# శ్రీశ్రీశ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు

## - వైభవంగా అమ్మవారి జాతర వేడుక



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** శ్రీశ్రీశ్రీ కరక చెట్టు పోలమాంబ అమ్మవారిని జనసేన పార్టీ విశాఖ నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్, పద్మజ దంపతులు దర్శించుకున్నారు. అమ్మవారి గర్భాలయంలో ఆలయ అర్చకులు పసుపు, కుంకుమతో ఎమ్మెల్యే దంపతులతో ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో గాయత్రి రాజ్ గోపాల్ అమ్మవారి చిత్ర పటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలందరూ అమ్మవారి దయతో ఎటువంటి విపత్తులు, చెడు సంఘటనలు జరగకుండా, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసిన ప్రభుత్వ యంత్రాంగానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : అనురాధ



**అల్లవరం, (రాజధాని వార్తలు):** జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని, జర్నలిస్టుల సమస్యలపై పోరాడుతానని అమలాపురం మాజీ ఎంపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం (జోన్ 2) వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా అనురాధ అన్నారు. డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ మరియు ఏపీబీజేఏ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఆమె అభినందనలు తెలిపారు. ఏపీ డబ్ల్యు జేఎఫ్– ఏపీ బి జే ఏ జిల్లా మహాసభ విజయవంతమైన సంద ర్భంగా మహాసభలో పాల్గొని అమూల్యమైన సందే శాన్నిచ్చి తమకు సహకరించిన మాజీ ఎంపి అనురాధకు కృతజ్ఞతలు తెలిపేందుకు మంగళవారం అల్లవరం మండలం మొగళ్ళమూరులో అనురాధ నివాసానికి వెళ్లిన సందర్భంగా జర్నలిస్ట్ నేతలను ఆమె దుస్సాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే గోడిలోని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపిన సందర్భంగా జర్నలిస్ట్ నూతన కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ డబ్ల్యు జె ఎఫ్ అధ్యక్షులు మట్టపర్తి శ్రీనివాస్, ఏపీ బీజేఏ అధ్యక్షులు కదలి రాజు, వాతాడ బాబులు, కదలి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి పరమట బీమా మహేష్, దిడ్ల మోహన్, దంగేటి శ్రీనివాసరావు, అద్దంకి భాస్కర్ అక్రిడేషన్ కమిటీ సభ్యులు సమయ మంతుల హరి పాల్గొన్నారు.

# ఏరియా ఆసుపత్రికి వాటర్ యూనిట్ అందజేత




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి పెద్దాపురం ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ న్యూ జెన్ క్వీన్స్ రూ. 10 వేలు విలువజేసే కూల్ అండ్ హాట్ వాటర్ డిస్పెన్సర్‌ను మంగళవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షురాలు పాలకుర్తి శ్రీహరి, కార్యదర్శి తాళ్లూరి మేఘన, కంభంపాటి నవ్యశ్రీలు ఈ యూనిట్‌ను పెద్దాపురం ప్రాథమిక చికిత్స కేంద్రం సూపరింటెండెంట్ డా. ఆర్.ఉమ మహేశ్వరికి అందజేశారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ వారం రోజుల క్రితం ఇచ్చిన మాట ప్రకారం ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ న్యూ జెన్ క్వీన్ క్లబ్ నుంచి బాలింతలకు ఉపయోగపడేలా పెద్దాపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి రూ. 10వేలు విలువ కలిగిన హాట్ అండ్ కోల్డ్ వాటర్ డిస్పెన్సర్ హాస్పటల్ ప్రాంగణంలో అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకుడు దేవత రాజేష్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డా.రాజ్ కుమార్, ప్రసూతి వైద్య నిపుణులు డా.ఆర్.జగదాంబ, ఐసిటిసి కౌన్సిలర్ బి శ్రీనివాసరావు, స్టాఫ్ నర్స్ లోవరాణి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమక్షంలో కూరాడ పీఏసీఎస్ జనరల్ బాడీ సమావేశం

## - సభ్యులకు లాకర్ సదుపాయం : అధ్యక్షుడు సూరిబాబు



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం కూరాడ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జనరల్ బాడీ సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశం సంఘ అధ్యక్షులు వెలుగు బంట్ల సూర్యనారాయణ మూర్తి (సూరిబాబు) అధ్యక్షతన జరిగింది. సభలో సంఘ సభ్యులు, రైతులు, కౌలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రబీ సీజన్‌కు అవసరమైన యూరియా సహా ఇతర ఎరువులను ఎటువంటి అంతరాయం లేకుండా అందుబాటులోకి తీసుకు వచ్చినందుకు రైతులు అధ్యక్షుడిని అభినందించారు. ఈ సందర్భంగా సంఘం లాభ–నష్టాల వివరాలు, జమా–ఖర్చులపై సభ్యులతో విస్తృతంగా చర్చించి, వాటికి సభ ఆమోదం తెలిపింది. సంఘ సభ్యులకు త్వరలో లాకర్ సదుపాయం కల్పించనున్నట్లు అధ్యక్షుడు సూరిబాబు ప్రకటించారు. సొసైటీ అభివృద్ధి కోసం కృషి చేస్తూ, రైతులకు అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సెక్రటరీ బచ్చు పరసురాముడు, రైతులు, కౌలు రైతులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధిలో పెద్దాపురం ప్రథమం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** అభివృద్ధి పథంలో పెద్దాపురం నియోజకవర్గం ప్రథమంలో ఉందని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పలు అన్నారు. మంగళవారం సామర్లకోట మండలం అచ్చంపేట గ్రామంలో ఉపాధి హామీ, గ్రామ పంచాయతీ నిధులు రూ. 45 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రారంభోత్సవంలో వీరు పాల్గొని మాట్లాడారు. పెద్దాపురం నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం జరుగుతూనే ఉంటుందని, అన్ని గ్రామాల్లో, రెండు పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయలు నూతనంగా నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం పెదప్రజలకు చేరువలో ఉంటుందని, గత వైసీపీ ప్రభుత్వం చేసిన అరచకపాలన వల్ల చాలా నష్టపోయిందని, తిరిగి మళ్ళీ సరైన గాడిలోకి రాష్ట్రాన్ని తీసుకురావడానికి రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా శిలాఫలకాలు ఆవిష్కరించి, రిబ్బన్ కత్తిరించి పంచాయతీ భవనాన్ని కారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, అచ్చంపేట గ్రామ జనసేన నాయకులు పబ్బినిడి ఈశ్వరరావు, అచ్చం పేట పిఎసిఎస్ అధ్యక్షులు అడ్డాల వెంకన్నబాబు, గ్రామ సర్పంచ్ విరాంరెడ్డి చినబాబు, తెదేపా నాయకులు వీరాంరెడ్డి పెదబాబు, జనసేన పార్టీ పి ఎ సి ఎస్ డైరెక్టర్ బావిశెట్టి గంగాబాబు, బండే నాగేశ్వరావు, మండల యువత అధ్యక్షులు మలిరెడ్డి బుచ్చి రాజు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మణి కుమారి, వైస్ చైర్మన్ సిద్దు భావన్నారయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బావిశెట్టి ఏసుబాబు, ఉపాధి హామీ అధికారులు పాల్గొన్నారు.

# గ్రాజియా ఈవెంట్‌లో 'బమ్ డిగీ డిగీ' బ్యూటీ హొయలు



'బమ్ డిగీ డిగీ' సాంగ్‌తో కుర్రకారు గుండెల్లో సెన్సేషన్ క్రియేట్ చేసిన సాక్షి మాలిక్ తాజాగా జరిగిన గ్రాజియా ఫ్యాషన్ అవార్డ్స్ 2026 వేడుకలో తళుక్కుమంది. ఈ ఈవెంట్ కోసం సాక్షి ఎంచుకున్న వైట్ అండ్ వైట్ అవుట్‌ఫిట్ అందరినీ మంత్ర ముగ్ధులను చేసింది. శ్వేత వర్ణపు దుస్తుల్లో దేవకన్యలా మెరిసి పోతుంటే కెమెరా కళ్లు అన్నీ ఈ బ్యూటీపైనే నిలిచిపోయాయి. ఫ్యాషన్ విషయంలో తనదైన ముద్ర వేయడానికి సాక్షి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ వేడుక మరోసారి నిరూపించింది. ముఖ్యంగా సాక్షి మాలిక్ ఇన్ స్టా వీడియోలో చూపిస్తున్న హొయలు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇలా కెమెరా ముందు ఫోజులివ్వడమే కాదు.. తన సింపుల్ స్మైల్‌తో పరిస రాల్లో వెలుగులు నింపింది. సాక్షి రాకతో కెమెరా ఫ్లాష్‌లు ఆగకుండా మెరుస్తూనే ఉన్నాయి. ఈ యంగ్ బ్యూటీ గ్రేస్ ..ఆత్మవిశ్వాసం రెడ్ కార్పెట్ పై ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అందుకే నెటిజన్లు సైతం "సాక్షి కేవలం ఫోజులివ్వలేదు.. ఆ సీన్ మొత్తాన్ని వెలిగించేసింది" అంటూ కామెంట్లతో ముంచెత్తు తున్నారు. సాక్షి మాలిక్ తన కెరీర్ ప్రారంభంలో 'సోను కె టిటుకి స్వీటీ' సినిమాలోని స్పెషల్ సాంగ్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత మోడలింగ్ రంగంలో మ్యూజిక్ వీడియోస్‌లో తన గ్లామర్‌తో తిరుగులేని పాపులారిటీ సంపాదిం చుకుంది. కేవలం గ్లామర్ మాత్రమే కాదు.. ఫిట్‌నెస్ విషయంలో కూడా ఈ బ్యూటీ ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలు స్తోంది. సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్లే తన క్రేజ్‌కు నిదర్శనం. ప్రస్తుతం సాక్షి మాలిక్ తన తదుపరి సినిమాల విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. 2026లో ఈ భామ రెండు బాలీవుడ్ ప్రాజెక్టులకు సంతకం చేసినట్లు సమాచారం. అందులో ఒకటి ప్రముఖ ప్రొడక్షన్ హౌస్ నిర్మిస్తున్న రొమాంటిక్ కామెడీ చిత్రం కాగా మరొకటి ఒక యంగ్ హీరో సరసన నటిస్తున్న యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్. కేవలం హిం దీలోనే కాకుండా.. దక్షిణాది సినిమాల్లో కూడా ఎంట్రీ ఇవ్వ డానికి సాక్షి ఆసక్తి చూపిస్తోంది. ఇప్పటికే కొన్ని టాలీవుడ్ నిర్మాణ సంస్థలు ఈ భామను సంప్రదించినట్లు వార్తలు వినిపి స్తున్నాయి. నటిగా తనని తాను నిరూపించుకోవడానికి వైవిధ్య మైన పాత్రల కోసం ఎదురు చూస్తున్నట్లు సాక్షి పలు సందర్భాల్లో పేర్కొంది. కేవలం ఐటెం సాంగ్స్ కోసం.. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. పెర్ఫార్మెన్స్ కు ప్రాధాన్యత ఉన్న పాత్రలు చేయాలని భావిస్తోంది. ఈ ఏడాది సాక్షి మాలిక్ కెరీర్‌లో ఒక మలుపు కోసం ఎదురు చూస్తోంది.

# ఓయ్ హీరోయిన్‌ను తలపిస్తున్న లేడీ డైరెక్టర్.. ఆమె ఎవరు? బ్యాక్ గ్రౌండ్ ఏంటో తెలుసా?





కాలం మారుతున్న కొద్దీ ప్రేక్షకుడిలో అభిరుచి మారిపో తోంది. అందుకు తగ్గట్టుగానే అటు హీరోలు మాత్రమే కాదు హీరోయిన్లు కూడా తమ రూటు మార్చుకొని తమ ప్రతిభతో వివిధ రంగాలలో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా హీరో యిన్స్ అంటే కేవలం గ్లామర్ పాత్రలకే అనే రోజులు ఎప్పుడో పోయాయి. కొంతమంది స్టార్ హీరోయిన్లు కూడా దర్శకత్వం వైపు అడుగులు వేస్తుంటే మరికొంతమంది ఇండస్ట్రీలోకి రావడమే దర్శకులుగా అవతారం ఎత్తుతున్నారు. అలా స్టార్ట్.. కెమెరా.. యాక్షన్ అంటూ మెగా ఫోన్ పట్టుకొని కెప్టెన్ ఆఫ్ ద సినిమా బాధ్యతలను స్వీకరించి లేడీ డైరెక్టర్స్‌గా తమ టాలెంటును ప్రూవ్ చేసుకోవడానికి సిద్ధం అయిపోతున్నారు. అందులో భాగంగానే ఈ మధ్యకాలంలో ఇప్పటికే సుధా కొంగర, గీతు మోహన్ దాస్, నందిని రెడ్డి, నీరజ కోన లాంటి లేడీ దర్శకులు చిత్ర పరిశ్రమలో తమ అద్భుతమైన దర్శకత్వ మెలకువలతో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అలాంటి వారిలో ఇప్పుడు అందరి దృష్టిని ఆకట్టుకున్న మరో లేడీ డైరెక్టర్ మానస శర్మ.

ప్రస్తుతం నిహారిక నిర్మాణంలో మానసా శర్మ దర్శకురాలిగా చేస్తున్న చిత్రం రాకాస. హారర్, కామెడీ ఫాంటసీతో ప్రేక్షకుల ముందుకు ఏప్రిల్ మూడవ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే సోమవారం రాత్రి రాకాస సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఇందులో ఎల్లో కలర్ చుడీదార్ ధరించి కళ్ళకు గ్లాసెస్ పెట్టుకొని చాలా అమాయ కంగా అందరి దృష్టిని ఆకట్టుకుంది డైరెక్టర్ మానస శర్మ. అందం, అభినయం, అమాయకత్వంతో పాటు చురుకైన మాట తీరుతో అందరిని ఆకట్టుకుంది. తెలుగుదనం ఉట్టిపడేలా ఉన్న ఈ అమ్మాయిని చూసి ప్రతి ఒక్కరు ఓయ్ సినిమా హీరోయిన్ షామ్లీలా ఉంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఓయ్ సినిమా హీరోయిన్ షామ్లీల ఉన్న మానస శర్మ బ్యాక్ గ్రౌండ్ ఏంటి? ఇంతకుముందు ఏం చేసింది? ఎక్కడి నుంచి వచ్చింది? అనే విషయాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. మానస శర్మ శ్రీకాకు ళం జిల్లా నుంచి ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది. మొదట రచయిత్రిగా తన కెరియర్ను ప్రారంభించింది మానస శర్మ. అలా తొలిసారి షార్ట్ ఫిలిమ్స్‌కి రచయితగా పనిచేసేది. ఆ తర్వాత 2024 సెప్టెంబర్ 12న సోనీ లీవ్‌లో స్ట్రీమింగ్‌కి అందుబాటులోకి వచ్చిన బెంచ్ లైఫ్ అనే వెబ్ సిరీస్ ద్వారా దర్శకురాలిగా, రచయితగా ఇండస్ట్రీకి పరిచయమైంది. ఇక్కడ విశేషం ఏమిటంటే ఈ సిరీస్‌కి కూడా నిహారిక తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ పై నిర్మించడం గమనార్హం. అందం, అమాయకత్వంతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న మానస శర్మ ఇప్పుడు రాకాస చిత్రంతో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందా అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. ఏదిఏమైనా సింపుల్ స్మైల్ తో షామ్లీలా ఉంది అనే ఒక కారణంతో ఒక్కసారిగా ట్రెండింగ్‌లోకి వచ్చేసింది మానస శర్మ.. మరి రాకాస సిని మాతో మరింత పాపులారిటీని దక్కించుకోవాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

# క్రేజీ సినిమాలపై ఉస్తాద్ భగత్‌సింగ్ ఎఫెక్ట్!



ఒక్కరి కోసం తీసుకునే నిర్ణయాలు ఎంతో మందిని ఎఫెక్ట్ చేస్తాయంటారు. అది ఉస్తాద్ భగత్‌సింగ్ విషయంలో అక్షరాలా నిజమైందా? అంటే నిజమైందని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. వివరాల్లోకి వెళితే..పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఐదేళ్ల క్రితం అంగీకరించిన మూవీ ఉస్తాద్ భగత్ సింగ్. 2021లో భవదీ యుడు భగత్‌సింగ్ పేరుతో ఈ ప్రాజెక్ట్‌ని ప్రకటించారు. కొత్త కథ, పవన్‌ని దృష్టిలో పెట్టుకుని హరీష్ శంకర్ ప్రత్యకంగా రాసుకున్న కథతో చేయాలనుకున్నారు. ఆ తరువాత స్టోరీ మారింది..టైటిల్ కూడా భవదీయుడు భగత్‌సింగ్ కాస్తా ఉస్తాద్ భగత్‌సింగ్‌గా మారింది. 2022 డిసెంబర్‌లో దీన్ని స్టార్ట్ చేశారు. పవన్ కల్యాణ్ ఏపీ రాజకీయాల్లో బిజీగా ఉన్న కారణంగా ఆయన డేట్స్ వీలుని బట్టి షూటింగ్ చేస్తూ వచ్చారు. ఫైనల్‌గా సినిమాని పూర్తి చేసి 2026 మార్చి 26న రిలీజ్ చేయాలని డేట్ ఫిక్స్ చేశారు. రామ్ చరణ్ పెద్ది రిలీజ్ డేట్ మార్చి 27. బాబాయ్ సినిమా వస్తుండటంతో అబ్బాయ్ పెద్ది రిలీజ్‌ని టీమ్ ఏప్రిల్ 30కి మార్చేసింది. ఇక్కడే అసలు కథంతా మొదలైంది. ఉస్తాద్ భగత్‌సింగ్, పెద్ది రిలీజ్ అయి పోతే సాఫీగా తమ తమ సినిమాలని వరుసగా థియేటర్లలోకి తీసుకురావచ్చని చిన్న సినిమాలు, టైర్ టు హీరోల సినిమాలు ప్లాన్ చేసుకున్నాయి. ఉస్తాద్ భగత్‌సింగ్ సడన్ ఎంట్రీతో వీటీ ప్లాన్ మొత్తం మారి తలకిందులైపోయింది. పెద్ది రిలీజ్‌ని బట్టి థియేటర్లలోకి తమ సినిమాలని కూడా తీసుకొ చ్చేయాలని అఖిల్ లెనిల్, నిఖిల్ స్వయంభు, నాగచైతన్య వృషకర్మ, వరుణ్ తేజ్ కొరియన్ కనకరాజు, సాయి ధరమ్ తేజ్ సంబరాల ఏటిగట్టు వంటి టైర్ 2 హీరోల సినిమాలతో పాటు చిన్న సినిమాలు కూడా గట్టిగానే ప్లాన్ చేసుకున్నాయి. ప్రమోషన్స్‌ని కూడా పక్కా ప్రణాళికతో సిద్ధం చేసుకున్నాయి. అయితే వాటన్నింటి ప్లానింగ్‌కు ఉస్తాద్ భగత్‌సింగ్ భారీ ఎఫెక్ట్ ఇచ్చిందని చెబుతున్నారు. అంతేకాకుండా ధురంధర్ 2 కూడా తీవ్ర ప్రభావాన్ని చూపించిందని ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తోంది. సమ్మర్ బరిలో నిలవాలని చాలా మంది హీరోలు తమ సినిమా లని సిద్ధం చేసుకుని రిలీజ్‌కు రెడీ అయిపోయారు. కానీ వారి ప్లానింగ్‌కు భారీ షాక్ ఇచ్చాయి ఉస్తాద్ భగత్‌సింగ్, ధురంధర్ 2. ఈ రెండు సినిమాల కారణంగా తెలుగులో టైర్ 2 హీరోల నుంచి చిన్న సినిమాల వరకు రిలీజ్‌లని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మార్చి 26న రావాలనుకున్న రామ్ చరణ్ పెద్ది ఏప్రిల్ 30కి వెళ్లిపోయింది. ఇప్పుడు అది కూడా కాదని, రిలీజ్ జూన్‌కు మారిందనే వార్తలు షికారు చేస్తున్నాయి. దీంతో ప్రతి సినిమా రిలీజ్ డేట్ మారిపోయి పరిస్థితి అస్థవ్యస్థంగా మారిందని, ఒక్క సినిమా ఎన్నో సినిమాల భవిత వ్యాన్ని మార్చేసిందని పలువరు టాలీవుడ్ వర్గాలు వాపోతు న్నారు. పెద్ది అనుకున్నట్టుగా ఏప్రిల్ 30నే వచ్చేస్తే ఓకే లేదా చివరి నిమిషంలో రిలీజ్ డేట్‌ని జూన్‌కి మార్చేశాం అంటే మిగతా సినిమాల పరిస్థితి ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని, మేకర్స్ ఈ విషయంలో క్లారిటీని ఇచ్చి పెద్ది ఏప్రిల్ 30నే వచ్చేస్తుందని ప్రకటించాలని, అలా చేస్తేనే మిగతా సినిమాల రిలీజ్‌లకు ఎలాంటి కన్ఫ్యూజన్ ఉండదని ట్రేడ్ వర్గాలు అంటున్నాయి.

# బన్నీ బర్త్ డే ట్రీట్.. ప్లాన్ ఎలా ఉందంటే?



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ బర్త్ డే (ఏప్రిల్ 8) అభిమాను లకు ఒక పండుగలాంటిది. ఆ రోజు ఆయన నటిస్తున్న సినిమాల నుంచి ఏదో ఒక భారీ అప్డేట్ వస్తుందనే ఆశతో ఫ్యాన్స్ ఎదురుచూస్తుంటారు. ముఖ్యంగా టీజర్, గ్లింప్స్ వంటి విజువల్ ట్రీట్స్ కోసం భారీ ఎక్స్పెక్టేషన్స్ కనిపిస్తుంటాయి. అయితే ఈసారి మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో వీడియో అప్డేట్ ఉండకపోవచ్చనే వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బన్నీ, ప్రముఖ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ జోనర్‌లో భారీ సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం బన్నీ కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా అంత భావిస్తున్నారు. ఆ సినిమా నుంచి బన్నీ బర్త్ డే సందర్భంగా గ్లింప్స్ లేదా టీజర్ విడుదల అవుతుందని అభిమానులు ఆశించినప్పటికీ, ఆ అంచనాలకు బ్రేక్ పడినట్టే కనిపిస్తోంది. తాజాగా ప్రముఖ నిర్మాత బన్నీ వాసు ఆ విషయంపై క్లారిటీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, "నాకు తెలిసినంత వరకు బన్నీ పుట్టినరోజున ఎలాంటి వీడియో కంటెంట్ విడుదల చేసే ఆలోచన చిత్ర యూనిట్‌కు లేదు. ఈసారి టైటిల్ అనౌన్స్మెంట్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల అవుతుంది" అని వెల్లడించారు. స్పెషల్ మూవీ కనుక స్పెషల్ ప్లాన్ తో మూవీ టీమ్ ఉందని, అందుకే విజువల్ ట్రీట్ ఇప్పుడు లేదని చెప్పారు. అయితే ఆ సినిమా బన్నీ కెరీర్‌లో చాలా స్పెషల్ కావడంతో మేకర్స్ జాగ్రత్తగా ముందుకు వెళ్తున్నారు. మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్న ఆ ప్రాజెక్ట్ కు సంబంధించిన విజువల్స్‌ను ఇప్పుడే బయటకు తీసుకురావడం వల్ల సినిమాపై ఉన్న ఆసక్తి తగ్గిపోవచ్చని వారు భావిస్తున్నట్లు సమాచారం. అందుకే ముందుగా టైటిల్, పోస్టర్‌తోనే హైప్ క్రియేట్ చేయాలని నిర్ణయించుకున్నారని టాక్ వినిపిస్తోంది. దీంతో వీడియో అప్డేట్ కోసం ఎదురుచూసిన అభిమానులకు కొంత నిరాశ కలిగినా, టైటిల్ అనౌన్స్మెంట్, స్పెషల్ పోస్టర్‌పై ఆసక్తి పెరుగుతోంది.

ప్రస్తుతం సోషల్ మీడియాలో ఆ విషయం వైరల్ అవుతోంది. బన్నీ బర్త్ డే సందర్భంగా వచ్చే పోస్టర్ ఎలా ఉ ండబోతుందో అనే చర్చలు అభిమానుల్లో మొదల య్యాయి. ఏదేమైనా బన్నీ బర్త్ డే నాడు స్టైలిష్ సర్ప్రైజ్ మాత్రం ఖాయం అయ్యింది. ఇక సినిమాలో హీరోయిన్ గా దీపిక పదుకొనె నటిస్తున్నారు.

# ప్రజా సేవే తమ లక్ష్యం : ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**- విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీరు - కోవూరు నియోజకవర్గంలో ఇది 26వ వాటర్ ప్లాంట్ - పార్లపల్లిలో గ్రామంలో 20 నెలల్లో 1 కోటి 2 లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**విడవలూరు, (రాజధాని వార్తలు):** ప్రజాసేవే తమ లక్ష్యంగా పని చేసేందుకు విపిఆర్ అండతో తాము రాజకీయాల్లోకి రాకముందు నుంచే తాము ప్రజా సేవకులమని పదవుల కోసం కాకుండా ప్రజలకు మరింత చేరువై సేవ చేయాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆశీస్సులుతోనే బాధితులకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. విడవలూరు మండలం పార్లపల్లి గ్రామంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'అమృత ధార' ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పవిత్ర సంకల్పంతో 2016లో ఉదయగిరిలో ప్రారంభమైన అమృత ధార ప్రస్థానం నేడు జిల్లా అంతటా విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 200 వాటర్ ప్లాంట్ల ద్వారా ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఇది 26వ ప్లాంట్ అని, దీని నిర్వహణ బాధ్యతను కూడా విపిఆర్ ఫౌండేషనే చూసుకుంటుందని ఆమె హామీ ఇచ్చారు. విడవలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాత్రులు డాక్టర్లు ఉండడం లేదని స్థానికుల ఫిర్యాదుతో స్పందించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జిల్లా వైద్యాధికారితో ఫోన్లో మాట్లాడి హాస్పిటల్లో నైట్ షిఫ్ట్‌లో డాక్టర్లను కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పార్లపల్లి గ్రామంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ జల్ జీవన్ మిషన్ ద్వారా 36 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్, 11 లక్షలతో డ్రెయిన్ల నిర్మాణం, 3 లక్షలతో సామాజిక మరుగుదొడ్ల నిర్మాణం చేసిన విషయాన్ని ఆమె తెలిపారు. ఎంపీ లాడ్స్, ఉపాధి హామీ మరియు పంచాయతీ నిధులతో కలిపి మొత్తం 9 సి.సి. రోడ్ల నిర్మాణం చేసామన్నారు.ఆరగాణి కాలువపై 10 లక్షలతో కల్వర్టు, జూ= నిధులతో స్మశాన వాటికల్లో షెల్టర్ల నిర్మాణం గురించి చెబుతూ గడిచిన 20 నెలల పార్లపల్లి గ్రామంలో 1 కోటి 2 లక్షలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఆమె వివరించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న స్మశాన వాటిక భూమి సమస్య పరిష్కారానికి తన వంతుగా రూ. 2.50 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ముగ్గురు అనారోగ్య బాధితులకు సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2 లక్షల 76 వేల ఆర్థిక సహాయం అందజేశామన్నారు. 1 కోటి 70 లక్షల రూపాయలతో పార్లపల్లి నుండి చవటపాలెం వరకు కనెక్టింగ్ రోడ్డు మరియు కల్వర్టు నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే ఈ పనులను మంజూరు చేయించి ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి హామీ యిచ్చారు. ఈ కార్యక్రమంలోటీడీపి మండలం అధ్యక్షులు ఏటూరు హరి రెడ్డి,స్థానిక సర్పంచ్ రామి శెట్టి స్వాతి, టీడీపి నేతలు, రామి శెట్టి వెంకటేశ్వర్లు, పంది శ్రీనివాసులు, బెజవాడ గోవర్ధన్ రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణ రెడ్డి, సత్యం రెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి. వివిధ శాఖ అధికారులు, తెలుగుదేశం కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు గ్రామస్తులు ఉన్నారు.

# అభివృద్ధి, సంక్షేమాలే కూటమి ప్రభుత్వ అజెండా

**- రేగడిచెలిక గ్రామంలో 55 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం - చేనేతలకు నేటి నుంచి అమలు కానున్న ఉచిత విద్యుత్ పథకం - ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 10 వేల 705 కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు రాబోతున్నాయి - సిఎం చంద్రబాబు నాయుడు చొరవతోనే గమేషా కంపెనీ స్థాపన : ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి - సహకారంతో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాల శిక్షణ - రైతులు పండించిన ప్రతి వడ్ల గింజ ప్రభుత్వం తీసుకుంటుంది : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**




**కొడవలూరు, (రాజధాని వార్తలు):** కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమాలకు సమ ప్రాధాన్యత ఇస్తుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. కొడవలూరు మండలం రేగడిచెలిక గ్రామంలో 40 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైన్లతో పాటు 15 లక్షలతో నిర్మించిన పంచాయితీ కార్యాలయ ప్రహారి గోడ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రుద్ది మాట్లాడుతూ కూటమి ప్రభత్వం అధికారంలోనికి వచ్చిన 21 నెలల్లో కొడవలూరు మండల వ్యాప్తంగా జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. రైతులు పండించిన ప్రతి వడ్ల గింజను ప్రభుత్వం గిట్టుబాటు ధరకు సేకరిస్తుందన్నారు. గత 30 ఏళ్లుగా నిర్లక్షానికి గురైన ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక పరిశ్రమలు స్థాపించేందుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. మరో ఏడాదిలో ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 10 వేల 705 కోట్ల రూపాయల పెట్టుబడితో పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. ఐదేళ్లలో యువతకు 20 లక్షలు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఐటి మంత్రి లోకేష్ హామీ కార్యరూపం దాల్చనుందన్నారు. ఏప్రియల్ ఒకటి నుంచి చేనేత వర్గాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్తు పథకాన్ని అమలులోకి తీసుకు రానుందన్నారు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి. చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా వినియోగించవచ్చున్నారు. ఈ పథకం ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా 531 మంది చేనేతలకు లబ్ది చేకూరనుందనాన్రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడాతూ సిఎం చంద్రబాబు నాయుడు చొరవ కారణంగానే 2016 లో విండ్ పవర్ ఫ్యాన్లు తయారు చేసే గమేషా కంపెనీ కంపెనీ స్థాపన జరిగిందన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇచ్చేలా చట్టబద్ధమైన హామీ యివ్వాలని శాసనసభలో ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చిన విషయాన్ని ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో కిసాన్ సెజ్‌లో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ యిచ్చి కిసాన్ సెజ్‌లో ఏర్పాటు చేసే పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మేం చేసిన అభివృద్ధి పనులు మీరు ఎలా ప్రారంభోత్సవం చేస్తారనే వైసిపి నేతలకు శంఖుస్థానాలు చేసాక పని పూర్తి చేయాలని టెంకాయ కొట్టేసి మేం చెప్పుకుంటే కుదరదని సూటిగా సమాధానం చెప్పారు. కూటమి ప్రభుత్వ 21 నెలల కాలంలో రేగడిచెలిక గ్రామాభివృద్ధి కోసం 1 కోటి 6 లక్షల 5 వేల579 రూపాయలు వెచ్చించిన అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు వివరించారు. సర్పంచుల పదవీ కాలం రేపటితో ముగియనుందన్నారు. స్థానిక సంస్థల నిధులను గత ప్రభుత్వం పక్క దారి పట్టించడంతో అభివృద్ధి చేయలేక అసంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నారనని స్థానిక సంస్థల బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభత్వ చొరవను ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీడీపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జి వి ఎన్ శేఖర్ రెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు. బెల్లం వెంకయ్య వివిధ శాఖ అధికారులు కొడవలూరు మండల ముఖ్య నాయకులు మరియు టిడిపి కూటమి పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# జూన్ నెలాఖరులోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

**- జిల్లా కలెక్టర్ ఎస్.రాం సుందర్ రెడ్డి ఆదేశం**




**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో మంజూరైన గృహ నిర్మాణాలన్నింటినీ ఈ ఏడాది జూన్ మాసంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి గృహ నిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మరియు ఎంపీడీవోలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా చేరుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం జిల్లాలోని వివిధ లేఅవుట్లలో 16,316 ఇళ్లు, సొంత స్థలాల్లో వ్యక్తిగతంగా మంజూరైన మరో 3,161 ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. నిర్మాణాల రోజువారీ ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని, దీనిపై క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా టిడ్కో ఇళ్ల పూర్తిపై మున్సిపాలిటీల వారీగా ఆరా తీసిన కలెక్టర్, మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం జరగకుండా చూడాలని ఆదేశించారు. నిర్మాణ దశల్లో ఉన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు మండలాల వారీగా డీఈలు, ఏఈలు లబ్ధిదారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మురళీమోహన్, వివిధ మండలాల ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# కోవూరు బందెలకు చివరి వీడ్కోలు పలికిన వైసీపీ నేతలు




**కోవూరు, (రాజధాని వార్తలు):** బందెల అనంత్ కుమార్ మృతికి పలువురు వైసీపీ నేతలు నివాళులు అర్పించారు. వారి స్వగృహానికి వెళ్లి ఆనంత్ పార్థివ దేహానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులును కుటుంబ సభ్యులను పరామర్శించిన జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షులు శివుని నరసింహారెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి మల్లికార్జున్ రెడ్డి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులు బల్లం చెంచు రెడ్డి మండల పార్టీ అధ్యక్షులు అత్తిపల్లి అనూప్ రెడ్డి, మండల పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షులు, భీమతాటి శ్రీధర్ పార్టీ నాయకులు షేక్ గయాజ్ పలువురు ఉన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**తిరుపతి, (రాజధాని వార్తలు):** రూరల్ మండలం పరిధిలోని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగళ్ళ, యర్రావారిపాలెం మండలాలకు సంబందించిన పలువురికి కూటమి ప్రభుత్వం సిఎంఆర్ ఎఫ్ సహాయనిధి ద్వారా సుమారు 16 లక్షల 44 వేల రూపాయలు మంజూరు చేసింది. అనారోగ్య, ఇతర సమస్యలతో బాధపడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లితే తక్షణమే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు మంజూరు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వచ్చిన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పులివర్తి నాని బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు. కష్టకాలంలో మా కుటుంబాలను ఆదుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కి, ఎమ్మెల్యే పులివర్తి నానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యన్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎష్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లూరిత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్‌పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధికి కీలక అడుగులు

(మొదటి పేజీ తరువాయి)

కోరనున్నారు. ఇప్పటికే స్వదేశ్ దర్శన్ 2.0 క్రింద మంజూరైన బొర్రా గుహలు, సూర్యలంక, నాగార్జున సాగర్, అహోబిలం, ప్రసాద్ పథకం క్రింద అన్నవ రం మరియు సింహాచలం పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి త్వరితగతిన నిధుల విడుదలకు చర్యలు తీసుకోనున్నారు. 1936–1974 మధ్య ఎనిమిది సంపుటాలుగా వెలువడిన 'సూర్య రాయాంధ్ర నిఘంటువు' తెలుగు భాషా చరిత్రలో ఒక అద్భుతమైన గ్రంథమని, ఇందులో 1.1 లక్షలకు పైగా పదాలు ఉన్నాయని, పాత కాలపు ముద్రణ పద్ధతుల వల్ల ప్రస్తుతం ఇది చదువరులకు కష్టంగా మారిందని మంత్రి దుర్గేష్ అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచన మేరకు ఆధునిక సాంకేతికతతో, కొత్త ఫాంట్లతో 'సూర్యరాయ నిఘంటువు' పునర్ముద్రణపై కీలక చర్చలు జరిపి కేంద్ర నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. ఇప్పటికే సూత్రప్రాయ అంగీకారం వచ్చినప్పటికీ కార్యరూపం తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోనున్నారు. అదే విధంగా 6 సాంస్కృతిక ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల మంజూరుపై కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను మంత్రి దుర్గేష్ అభ్యర్థించనున్నారు. అనంతరం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వారసత్వ అభివృద్ధికి కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ అందిస్తున్న నిరంతర సహకారానికి కృతజ్ఞతలు తెలుపనున్నారు.

**రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఏర్పాటుకు చర్యలు ముమ్మరం:**
ఆంధ్రప్రదేశ్ పద్య నాటకం, సురభి థియేటర్, వీధి నాటకం వంటి గొప్ప రంగస్థల కళలకు నిలయమని, జాతీయ స్థాయిలో గుర్తింపు, సరైన శిక్షణ సంస్థలు లేక ఈ కళలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయని వివరించి రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా తెలుగు నాటకరంగానికి పునర్జీవం పోయవచ్చని మంత్రి దుర్గేష్ మరోసారి కేంద్రాన్ని అభ్యర్థించనున్నారు. ఇప్పటికే కేంద్ర సాంస్కృతిక శాఖ సంయుక్త కార్యదర్శి, ఎన్ ఎస్ డీ అధికారులు రాజమండ్రిలో స్థల పరిశీలన పూర్తి చేశారని, ఈ ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటంతో త్వరగా ఆమోదించాలని కోరనున్నారు.

**ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ ఏర్పాటుకు కృషి :**
కూచిపూడి నృత్యం, గొప్ప చారిత్రక సాహిత్యం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడి కోసం ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ బ్రాంచ్ ఏర్పాటు అత్యవసరమని కూటమి ప్రభుత్వం భావిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ కేంద్రానికి తెలపనున్నారు. అందుకు అవసరమైన వసతి సౌకర్యాలను కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, తద్వారా రాష్ట్ర కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటుకోవడానికి అవకాశం లభిస్తుందని వివరించనున్నారు. 16 విశ్వవిద్యాలయాలు, 100 ఇంజనీరింగ్ కళాశాలలు, 12 వైద్య కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మరియు విద్యా మార్పిడికి కేంద్రంగా ఉందని రాష్ట్ర వైభవాన్ని తెలపనున్నారు.

**విశాఖపట్నంలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఏర్పాటు దిశగా అడుగులు**
విశాఖపట్నంలో లలిత కళా అకాడమీ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ద్వారా లలిత కళలను ప్రోత్సహించడంతో పాటు నూతన కళాకారులకు సరైన వేదికను అందించవచ్చనే ఉద్దేశంతో అవసరమైన కేంద్ర నిధులను మంజూరు చేయాలని మంత్రి దుర్గేష్ కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కోరనున్నారు.

**విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో 'కళాక్షేత్ర' ఆడిటోరియం నిర్మాణం:**
రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో సంగీత, నృత్య ఉత్సవాలు నిర్వహించడానికి తగిన స్థాయి ఆడిటోరియం అందుబాటులో లేదని, ఈ క్రమంలో విజయవాడలోని ఘంటసాల వెంకటేశ్వరరావు సంగీత మరియు నృత్య కళాశాలలో 'కళాక్షేత్ర' ఆడిటోరియం నిర్మిస్తే, అది కళాకారులకు మరియు విద్యార్థులకు గొప్ప వేదికగా మారుతుందని కేంద్రానికి విన్నవించనున్నారు.

**సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం:**
యోగి వేమన, పుట్టపర్తి నారాయణాచార్యులు వంటి మహామహులైన కవుల వారసత్వాన్ని, తెలుగు సాహిత్యాన్ని పరిరక్షించడానికి సాహిత్య అకాడమీ ప్రాంతీయ కేంద్రం ఎంతగానో తోడ్పడుతుందని, దీని ఏర్పాటు ద్వారా కవులకు, రచయితలకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుందని కేంద్రానికి వెల్లడించనున్నారు. భారతదేశ సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలనే ఉమ్మడి లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ సమర్పించిన ఈ ప్రాజెక్టులకు కేంద్ర మద్దతు ఇవ్వాలని మంత్రి దుర్గేష్ హస్తిన పర్యటనకు వెళ్లనున్నారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల బలోపేతం, రవాణా సౌకర్యాల మెరుగుదల, పర్యాటకుల అనుభూతిని పెంపొందించడంపై దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం.. సీఎం చంద్రబాబు నాయుడు విజన్ మేరకు ఏపీని పర్యాటక హబ్‌గా మార్చేందుకు మంత్రి దుర్గేష్ కసరత్తు చేస్తున్నారు. కొత్త పర్యాటక ప్రాజెక్టులకు ఆమోదం వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత పర్యాటకాభివృద్ధి చెందే అవకాశం ఉందని, తద్వారా పర్యాటకుల రాక పెరగడమే కాకుండా, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు మేము కట్టుబడి ఉన్నాము. కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సహకారంతో రాష్ట్ర పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. మౌలిక సదుపాయాల కల్పన ద్వారా స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఉపాధి కల్పన మా ప్రాధాన్యత." అని మంత్రి కందుల దుర్గేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా మంత్రి దుర్గేష్ మరికొంతమంది కేంద్ర మంత్రులతో కూడా భేటీ అయ్యే అవకాశం ఉంది. ఈ ఢిల్లీ పర్యటన ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి "అనుకూల పవనాలు" తీసుకు వస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి కందుల దుర్గేష్ హస్తిన పర్యటన సక్సెస్ అవ్వాలని ఆశిద్దాం.

# కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## - మున్సిపల్ కార్మికుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

**గూడూరు, (రాజధాని వార్తలు):** దీర్ఘకాలికంగా మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల పట్టణ ప్రధాన కార్యదర్శి కోటేశ్వర రావు డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరు పట్టణంలోనీ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల నిరసన కార్యక్రమం నిర్వహించి ఆర్డీవో సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు కోటేశ్వరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు తక్కువ జీతాలకు పని చేస్తున్నారని గతంలో సమ్మె కాలానికి జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఇంతవరకు చెల్లించలేదని ఇంకా అనేక సమస్యలు పెండింగ్లో ఉన్నాయని వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సి ఐ టి యూ గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి.. బీవీ రమణయ్య మని, శాంతి వర్ధన్, మణెమ్మ, కే అదేమ్మ, పద్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**కోట, (రాజధాని వార్తలు):** మండలంలోని విద్యానగర్‌లోని శ్రీనివాస స్కూల్‌నందు విద్యాసంస్థల చైర్మన్ నీలం సురేందర్ రెడ్డి, కోట ఫైర్ స్టేషన్ ఇన్చార్జి స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కర్లపూడి శ్రీనివాసులు విద్యార్థులకు ప్రమాదాలు జరిగినప్పుడు ఏ రకంగా మనల్ని మనం కాపాడుకోవాలో అదేవిధంగా ఎలక్ట్రిసిటీ ఫైర్ అయినప్పుడు ఏ విధంగా ముందస్తు చర్యలు తీసుకోవాలో తెలియజేశారు. మరియు ఇంటిలో నిత్యం వాడే వంటగ్యాస్ ప్రమాదం జరిగినప్పుడు ఏ విధంగా దాన్ని నివారించాలో సరైన సమయానికి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో అన్న విషయాలను డెమో రూపంలో విద్యార్థులకు చూపారు. అదేవిధంగా పాఠశాల భవనంపై అంతస్తులో చదువు తున్న విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వారిని ఏ విధంగా పై అంతస్తు నుంచి కిందకు తీసుకురావాలి పొరపాటున స్పృహ కోల్పోయినప్పుడు ఏ రకమైన చర్యలు తీసుకోవాలా అన్న విషయాలను బట్టి డెమో రూపంలో అవగాహన చేసి చూపించారు.

ఈ కార్యక్రమంలో హెడ్కానిస్టేబుల్ సుధాకర్ వర్ధన్, కానిస్టేబుల్ చిట్టెడు శ్రీనివాసులు, శ్రీనివాస విద్యా సంస్థలు చైర్మన్ నీలం సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan